

# యలిమెంటు

ఒకనాటి మధ్యాహ్న సమయంలో "బాబూ ఇన్‌స్ట్రుమెంటు కంపెనీ" కార్మికులు సమ్మెలోకి దిగేరు.

ఈ వార్తవిన్న మంత్రివర్యులు కార్మికుల్ని రక్షించటంకోసం ఆ వూరి విమానాశ్రయంలో దిగేరు.

కంపెనీ ఆస్తిపాస్తుల్ని కార్మికులు ధ్వంసం చేయకుండా పరిరక్షించటానికి పోలీసువారు వేనుల్లో దిగేరు.

ఇంతమంది ఇన్నివిధాల దిగినా, కంపెనీ పాలకపక్షంవారు మాత్రం ఒక్క మెట్టుకూడా దిగలేదు.

దిగవలసిన అవసరం తమకు లేదని బల్లమీద రూళ్ళకర్రతో కొట్టి మరీ చెప్పారు. ఢంకామీద కొట్టి చెప్దామనుకున్నారు కాని ఆ కంపెనీలో కొన్ని సన్నితమయిన పరికరాలే తప్ప ఢంకాలు తయారు చేయను కనుక వారికా అవకాశం చిక్కలేదు. అసలు, ఆ మధ్యాహ్నసమయంలో కార్మికులు సమ్మెకు దిగిన కారణం ఇది-

“లంచ్” సమయంలో ఆ కంపెనీచేత నడపబడుతున్న కేంటీనులో “చటోపాధ్యాయ” తన అనుచరులతో కలిసి కూర్చుని కబుర్లుచెప్తూ భోజనానికి ఉపక్రమించేడు. చటోపాధ్యాయ ఆ కంపెనీ కార్మిక వర్గానికి నాయకుడు. మనిషి సన్నగా, పీలగా వున్నా అతని బుర్ర అమోఘమయినదని ఆ కంపెనీలో చాలామంది అభిప్రాయం. ఈ అభిప్రాయంతో ఏకీభవించటానికి చటోపాధ్యాయకు అణువంతయిన అభ్యంతరం లేదు కూడా!

“మేనేజిమెంటు ఈ మధ్య మరీ మితిమీరి పోతోంది గురూ!” అన్నాడొక శష్యపరమాణువు.

గురువు అవునన్నట్టు తల ఆడించి ఊరుకున్నాడు.

“ఏవిటి? ఏవైంది?” అని అడగలేదు తను. అలా అడిగితే అతని గొప్పతనమే లేదు.

“....మన ముత్తెంగాడు లేడూ? ఎవరు? మన “ప్యూను” ముత్తెంగాడు- అడికి, సరిగ్గా పన్జెయ్యలేదని చెప్పి ఛార్జిషీటిచ్చేసినారు. మనం ఇలా వూరుకుంటే శానా గోరాలు జరిగిపోతాయి.” అని ఆగేడు శిష్యుడు. ఆగేక, తను చెప్పిన సంగతి “గురుడు” మీద ఏమాత్రం పనిచేసిందో చూస్తూ వుండిపోయాడు. అంతలోనే సర్వరు కుర్రాడు “సార్ కర్రీ.” అంటూ ప్లేటుతో కోడిగుడ్డు తీసుకొచ్చి అక్కడ వుంచేడు.

చటోపాధ్యాయ సర్వరు కుర్రాడివంక సీరియస్‌గా చూసేడు. తరువాత “ఇదేటిరా?” అన్నాడు. అనలేదు, అరిచేడు. తను

ప్లేటుతో తెచ్చింది ఉడికించిన కోడిగుడ్డే తప్ప పేలబోయే ఆటంబాంబు కాదని చెప్పినంత సున్నితంగా "గుడ్డు.... కోడిగుడ్డు" అన్నాడు.

"అది కనబడుతూనే వుంది. గుడ్డు కోడి కాకపోతే నువ్వేడతావేటి? అసలు "మెనూ" ప్రకారం ఈవేళ కాంటీనులో ఏం వండాలి?" అన్నాడు.

"చేపల కూర" అన్నాడు వాడు నసుగుతూ.

"మరి వండలేదే? గుడ్డెందుకు పట్టుకొచ్చావ్? మాకు చేపలకూరే కావాలి. చటోపాధ్యాయకు చేపలన్నా, స్ట్రయికులు చేయించటమన్నా చాలా ఇష్టం. అతడు పుట్టటం వంగదేశంలోనైనా పెరగటం ఆంధ్రదేశంలోనే జరిగింది. ఆవేశానికి మటుకు అతని నరనరాల్లో వంగరక్తం నిండుగా వుంది.

"నాకేం తెలీదుసార్! కేంటీను మేనేజరుగారిని అడగండి."అంటూ సర్వరు కుర్రాడు మెల్లిగా జారుకున్నాడు.

చటోపాధ్యాయ తింటున్న ప్లేటు ఎదరకు తోసేసి లేచి నిలబడి చుట్టూ కలయజూశాడు. తరువాత చరచరా "కౌంటరు" దగ్గరికి వెళ్ళేడు. "మేనేజర్! ఈవేళ "మెనూ" ప్రకారం చేపల కూరేనా?" అన్నాడు.

"అవునండి. కానీ, చేపలు బజారులో దొరకటం లేదు. అందుకని గుడ్లు వండించేను." అన్నాడు మేనేజరు.

"సరే! మాకు ఇప్పుడు చేపలకూర కావాలి. ఇంతకీ వండిస్తారా! లేదా?"

"అలాగే! చేపలు ఎక్కడా దొరకటంలేదని చెప్పానుగా! నాలుగయిదు రోజులుగా అసలు చేపలు మార్కెట్టులోకే రావటంలేదు. దొరకని కూర వండించమంటే ఎలా చెప్పండి?" అన్నాడు మేనేజరు వినయంగా.

"సరే! ఎలా వండించరో చూస్తాం" అంటూ చటోపాధ్యాయ హాలు మధ్యలోకి వచ్చి "ఫ్రెండ్స్—"అంటూ గొంతు సవరించుకున్నాడు. అప్పటికే ఈసంగతి చూచాయగా తెల్సిన చాలామంది భోజనం మాని

అతని చుట్టూ గుమిగూడేరు. ఈవేళ చాలా దుర్దినం...." అంటూ క్షణం సేపు "రెస్పాన్సు" కోసం చుట్టూ కలయజూశాడు చటోపాధ్యాయ. తరువాత మళ్ళీ తన ప్రసంగం కొనసాగించేడు...."కేంటీన్‌లో మనకీ దినం చేపలకూర వడ్డించాలి. కాని, చేపలు దొరకటంలేదని గుడ్డువండేరు. అంటే; మేనేజిమెంటువారు మనం పూరుకున్నామని వారి చిత్త ప్రకారం ప్రవర్తిస్తున్నారన్నమాట! వారు ప్రతి విషయంలోనూ మనపై ఎలా పెత్తనం చెలాయిస్తున్నారో తెలుసుకోవాలంటే ఈ చిన్న విషయంచాలు. ఈ రకమయిన అన్యాయాలు ఇక మనం కొనసాగనివ్వకూడదు. ఈ దినం చేపలకూర వండటానికి నిరసనగా మనం "వాకౌట్" చేద్దాం" అన్నాడు ఆవేశంగా.

చుట్టూవున్న జనంలో కలకలం ప్రారంభమయింది.

"యూనియన్...." అంటూ రెండు చేతులూ ఎత్తి గట్టిగా అరిచేడు చటోపాధ్యాయ. "జిందాబాద్" అన్నాయి కొన్నిగొంతులు.

కాని చటోపాధ్యాయకు సంతృప్తిగా అన్పించలేదు. మరోమారు "యూనియన్" అంటూ పిడికిళ్ళు బిగించాడు. ఈమారు గొంతులన్నీ కలిసి "జిందాబాద్" అన్నాయి.

తలదించుకుని కేంటినునుండి నడిచి కంపెనీ గేటు బయటకు వెళ్ళిపోయాడు చటోపాధ్యాయ. చుట్టూవున్న మూడు వందలమంది కార్మికులూ అతన్ని అనుసరించేరు.

గేటు బయటకు రాగానే మళ్ళీ పెద్ద ఎత్తున నినాదాలు చేసేరు.

నినాదాలు చేసినవారిలో సగం మందికి పైగా "వాకౌట్" ఎందుకో అప్పటికీ అర్థంకాలేదు. "మనం "ఈవాకౌట్" ఎందుకు చేసేం?" అని అడిగేడు ఒకడు తన ప్రక్కనున్నవాణ్ణి. "ఏమో! తెలీదు! కంగారెందుకు? బయటకు వచ్చేసేంకదా. ఇంక తెలుస్తుంది!" అన్నాడు వాడు సమాధానంగా.

అంతలో చటోపాధ్యాయ తన అనుచరులతో కలసి అటు వచ్చేడు.

"ఇంతకూ మనం "వాకౌట్" ఎందుకు చేసేంగురూ?" అన్నారు కొంతమంది.

చటోపాధ్యాయ వాళ్ళవేపు హీనంగా చూసేడు "ఆ విషయం మీరు అడగ కూడదు, నేను చెప్పకూడదు" అన్నట్లున్నాయి అతని చూపులు.

కార్మికులందరూ తలోరకంగా మాట్లాడుకుంటున్నారు. కొంత మంది గుసగుసలాడుకుంటున్నారు. మరికొంతమంది దీనితో తమకేం సంబంధంలేనట్లు మీనమేషాలు లెక్కపెడుతూ నిలబడ్డారు. చాలామంది చటోపాధ్యాయచుట్టూ చేరారు. ఎవరి అనుమానాలు వాళ్ళు బయట పెడు తున్నారు.

ఈ రకమయిన కలకలం చటోపాధ్యాయకు నచ్చలేదు. క్రమశిక్షణ లోపిస్తే నాయకత్వం చేయటం మహా కష్టమని అతనికి తెలుసు. ఇంతకు ముందు తాను చేయించిన రెండు సమ్మెలూ అందుకే విఫలమయ్యాయనీ తెలుసు. మనుషులందర్నీ ఒకే తాటిమీదకు తెచ్చి నిలబెట్టేవి కేవలం నినాదాలు మాత్రమేనన్న సంగతి అతనికి బాగా ఒంటబట్టింది.

అందుకే తను మాట్లాడబోయేముందు మరోసారి గొంతుచించుకొని "యూనియన్" అన్నాడు.

"జిందాబాద్! అంటూ గొల్లుమన్నారు కార్మికులు.

"మేనేజ్‌మెంట్ ...." అన్నాడు.

సగంమంది "డౌన్‌డౌన్ అన్నారు.

సగంమంది "జిందాబాద్" అన్నారు.

చటోపాధ్యాయ కళ్ళలో రక్తం జేవురించింది. అతని ముఖం కోపంతో, అసహనంతో కందగడ్డలా అయిపోయింది.

"నేను "మేనేజిమెంట్" అంటే అందరూ "డౌన్‌డౌన్" అనాలి" అన్నాడు ఆవేశంగా అంతలో ఒకడు ముందుకొచ్చి "అదేమిటి బ్రదర్! నాలుగు దినాల క్రితమేకదా మేనేజిమెంట్ అంటే "జిందాబాద్" అనాలని చెప్పేవు" అంటూ తన సందేహాన్ని వ్యక్తం చేశాడు.

"అప్పుడు బోనస్ లిచ్చారు కనుక అలా అన్నాం. ఇప్పుడు మనల్ని "ఎక్స్ప్లాయిట్" చేసి పెత్తనం చలాయిస్తున్నారు కనుక డౌన్ డౌన్ అనాలి" అంటూ విషయాన్ని విశదీకరించాడు.

మొత్తానికి పరిస్థితి అంతా గోలగా తీన్ తేరాగా తయారయింది.

అంతలో పాలకవర్గంవారు సంభాషణలకు పిలుస్తున్నారని కబు రొచ్చింది.

చటోపాధ్యాయ, మరి నలుగురు అనుచరులతో కలిసి లోనికి వెళ్ళాడు.

"మీరు ఇలా ప్రతి చిన్న విషయానికీ "వాకౌట్" చేయటం బాగా లేదు" అన్నారు పాలకవర్గంవారు.

ఇలా ప్రతిచిన్న విషయంలోనూ మీరు అధికారదర్పం చూపించ టం కూడా బాగాలేదు" అన్నాడు చటోపాధ్యాయ.

"ఇందులో అధికారదర్పం చూపించటమేముంది? బజారులో చేపలు దొరక్కపోతే కేంటీను మేనేజరు మాత్రం ఏం చేయగలడు? మేం మాత్రం ఏం చేయగలం? బజారులో చేపలు ఎందుకు దొరకటంలేదో తెలుసుకొమ్మంటే ఇప్పుడే ఇద్దరు సభ్యులతో ఒక కమిటీవేస్తాం. వాళ్ళు సంగతి తెలుసుకొని నివేదిక మనకి ఈ వారంలో ఇస్తారు. అంతేకాని ప్రతి చిన్న విషయానికీ మీరు "వాకౌట్" చేస్తే మేం కంపెనీ "లాకౌట్" చేయవలసి వుంటుంది" అన్నారు పా.వ. వారు.

"ఎలా "లాకౌట్" చేస్తారోచూస్తాం. మేం ఈక్షణంనుంచీ మా "వాకౌట్"ని సమ్మెగా మారుస్తున్నాం గేటు దగ్గర శిబిరం వేసుకొని నిరసనవ్రతం ఆరంభించ బోతున్నాం" అంటూ చటోపాధ్యాయ ఆవేశంగా కూర్చీలోంచి లేచాడు. అతనితోబాటే అతని అనుచరులూ లేచారు.

గదిలోంచి బయటికి వెళ్ళిపోతూంటే మంత్రిగారు ఎదురొచ్చేరు తలమీద టోపీ సర్దుకుంటూ. సంగతి విచారించేరు.

"మీరు సంగతి తెలియకుండా సంభాషణ ఆపేసి ఇలా బయటకు

రావటం బాగాలేదు. ఈ ఇరుపక్షాలకూ మధ్య సఖ్యత కుదర్చటానికి నేను సరాసరి ఇంద్రప్రస్థం నుంచి వచ్చేను. లోపలకు పదండి" అంటూ కార్మిక నాయకుల్ని మళ్ళీ సంభాషణలకు కూర్చోబెట్టారాయన.

ఇంద్రప్రస్థంనుండి వచ్చిన మంత్రివరేణ్యులు చాలా ఘనులు. అంతకు ముందురోజే బెంగాల్‌లో రెండు సమ్మెలు ఆపుచేయించి, రెండు కంపెనీలు మూయించి ఈదినం ఇక్కడకి వచ్చేరు. ఈదినం రాత్రిలోగా ఇక్కడి సమస్యను పరిష్కరించి మరునాడు మరో ఊరికి వెళ్ళాలాయన.

"అయితే చేపలకూర గురించి ఇంత గొడవొచ్చిపడిందన్నమాట!" అంటూ అర్ధోక్తిగా ఆగేరు మంత్రివరేణ్యులు.

తరువాత ఇరుపక్షాల నుండీ వ్యవహారం విన్నారు.

విన్న తరువాత ఇరుపక్షాలతోనూ సంప్రదింపులు విడివిడిగా జరిపేరు.

కాఫీ ఫలహారాలు ముగించి మళ్ళీ "మీటింగు" పెట్టేరు.

"చేపలు బజారులో ఎందుకు దొరకటంలేదన్నది నాకు అనూహ్యమయిన సంగతిగా వుంది. అందునా ఈ వూరు సముద్రతీరంలో వుంది. చేపలు దొరకటం లేదంటే చాలా చింతించ వలసిన విషయం. ప్రస్తుతం మనకి చింతించటానికి టైములేదు కనుకదానికి వేరే కమిటీ వేయిస్తాను. కాని, ఇలాటి కంపెనీల్లో సమ్మె జరగటమంటే అది దేశసౌభాగ్యానికి సంబంధించిన విషయం...." మాటలు ఆపి ఖద్దరు టోపీ ఒకసారి సర్దుకున్నారు "అసలే మన దేశంలో సున్నితమైన పరికరాల తయారీ కరువయిపోయింది. వాటిని దిగుమతి చేసుకునేందుకు చాలా విదేశీ మారకం నష్టమయిపోతోంది. "ఇన్‌స్ట్రుమెంట్లు" తయారు చేసే ఈ కంపెనీలో ఒక్కగంట ఉత్పత్తి ఆగిపోతే అది దేశ సౌభాగ్యానికి ఎంతో నష్టం. అందుకని, మీరు వెంటనే పనుల్లో చేరిపోండి. చేపలు ఎందుకు దొరకలేదో, అసలు దొరక్కపోవటం నిజం అవునో, కాదో నేను

స్వయంగా విచారిస్తాను" అని గడగడా మాట్లాడి ఆయాసం తీర్చుకునేందుకు ఆగేరాయన.

చటోపాధ్యాయకు ఈ సలహా అంత రుచించలేదు.

"అదేం కుదరదు. వెనువెంటనే అసలు కారణం మీరు కనుక్కోవాలి, చేపలు దొరక్కపోవటమే నిజమయితే, అందుకు తగిన కారణం మీరు మాకు చెప్తే రేపే పనులో చేరిపోతాం. లేదా మా సమ్మె కొనసాగిస్తాం. అయితే పనిలోకి చేరాక మాత్రం మాకు మూడు రోజులు వరుసగా చేపలే వండించాలి" అన్నాడు.

ఇది కొంత సబబుగానే అనిపించింది మంత్రిగారికి.

చేపలు మార్కెట్టులోకి వచ్చేక వరుసగా మూడు దినాలు చేపల కూర వండించటానికి మేనేజిమెంటు వారిచేత ఒప్పించారు.

"ఆ విషయం మేం తప్పక ఆలోచించి ఆచరిస్తాం" అన్నారు పా. వ. వారు.

సాయంకాలంలోగా చేపలు దొరకని కారణం విచారిస్తామని చెప్పి మంత్రిగారు హుటాహుటిని కారులో బయలుదేరి మార్కెట్టుకు వెళ్ళారు.

ఆ వూరంతటికీ అదే పెద్ద బజారు చిన్న వానపడితేచాలు, బజారు చుట్టూ చెరువులా తయారవుతుంది వూళ్ళోవాళ్ళకు ఉచితంగా ఈత నేర్పే ఉద్దేశ్యంతో ఆ వూరి మునిసిపాలిటీవారు దయతలచి ఆ చెరువును అలాగే వుంచటం చాలా సంవత్సరాలుగా అలవాటు చేసుకున్నారు. మంత్రిగారు కారుదిగి వారి సెక్రటరీ సహాయంతో ఈదుకొంటూ మార్కెట్టులోకి ప్రవేశించారు. అయితే, మార్కెట్టు గేటుదాటి లోనికి వెళ్ళటానికి ఆయన కొంత కిష్టపడవలసి వచ్చింది. ఎందుకంటే, దానికున్న గేటులు చాలా చిన్నవి. ఒక మామూలు మనిషి దూరటానికి మాత్రమే పనికి వస్తాయి. చాలా ఇరుకుగా దానిలోంచి దూరి లోనికి వెళ్ళేరు మంత్రిగారు. ఇంత కష్టమూపడి లోనికివెళితే మార్కెట్టులోపల ఒక్కచేపకూడా కనిపించలేదాయనకు. చేపలు అమ్ముకునే వాళ్ళందరూ ఎండుచేపల్లా వున్నారు. అతి

దీనమయిన ముఖాలతో ఖాళీగా పనిలేకుండా కూర్చొని ఆడ, మగా విభేదం లేకుండా తల్లో పేలు చూసుకుంటున్నారు. మంత్రిగారివంక ఒకమారు చూసి మళ్ళీ పనిలో మునిగిపోయారు.

"చేపలమ్ముకునేవాళ్ళు! చేపలమ్ముకునేవాళ్ళూ! మీరు చేపలెందుకు అమ్మటంలేదు మీరు చేపలు అమ్మకపోవటంవలన ఒకపెద్దకంపెనీ సమ్మెలోకిదిగింది." అన్నారు మంత్రిగారు.

చేపలమ్ముకునే వాళ్ళందరూ పేలు చూసుకోటం మాని ఘొల్లుమని ఏడ్చేరు! తరువాత మొత్తుకున్నారు! ఆ తరువాత తీరిగ్గా ఏడుస్తూ మొత్తుకున్నారు! మంత్రిగారు గాభరాపడిపోయారు! వాళ్ళెందుకు మొత్తుకుంటూ ఏడుస్తున్నారో ఆయనకు అర్థంకాలేదు! వాళ్ళు ఏడవటం పూర్తి అయ్యాక ముక్తకంఠంతో ఇలా అన్నారు. "మేవూ చేపలకోసము కూకున్నామండి మారు బేరగాళ్ళు సరుకే తేవటం లేదు. నాలుగు రోజులనుండి ఎర్రని ఏగని కూడా సూడలేదు."

మంత్రిగారు మారుబేరగాళ్ళ దగ్గరకు వెళ్ళారు.
మారుబేరగాళ్ళు "మారువాడీ వాళ్ళలా వున్నారు.

"మారు బేరగాళ్ళు! మారు బేరగాళ్ళూ! మీరు చేపలు ఎందుకు తేవటంలేదు? మీ వలన ఒక పెద్ద కంపెనీ సమ్మెలోకి దిగింది" అన్నారు మంత్రిగారు.

"మీరలా సెలవిస్తే ఏం సెప్పమండి?! అసలు జాలరోళ్ళు ఎవరూ సముద్రంమీదికి ఎళ్ళందే! ఈ నాలుగురోజులనుండి ఒక్క సేపయినా పట్ట లేదు! ఎక్కడనుంచి తెమ్మంటారండి సేపలు? వంకాయలేటి సెట్లు దులిపి పట్రాడానికి?" అన్నారు కొంత రెచ్చిపోయి.

నాలుగు రోజులబట్టి కమీషను లేదని వాళ్ళకి ఒళ్ళుమంటగావుంది. మంత్రిగారు వెంటనే జాలరివాళ్ళు వుండే సముద్ర తీరానికిచేరుకున్నారు. కారు ఆగగానే నల్ల చేపలాంటి జాలరివాళ్ళు మెడలో ట్రాన్సిస్టర్లతో, కెమేరాలతో చుట్టుముట్టేరు.

"సార్! కెమేరాలుసార్!" అని ఒకడు. "స్మగుల్డు టేపు రికార్డరు వుంది చూపించమంటారా?" అని ఒకడు. మంచి విస్కీ సార్! ఫ్యాక్ట్రీ రుపీస్! నైస్ డ్రింక్!" అని మరొకడు అందరూ తలోక రకంగా మాట్లాడుతూ మంత్రిగారి చుట్టూ మూగేరు.

"సెక్రటరీ! వీళ్ళు ఏదో చెప్తున్నారు చూడు!" అంటూ వాళ్ళని సెక్రటరీకి అప్పజెప్పి ఆయన జాలరి గుడిసెల వద్దకు వెళ్ళారు.

గుడిసెల దగ్గర ముసలివాళ్ళు కూర్చొని వలలు అల్లుకుంటున్నారు. మరి కొంతమంది ట్రాన్సిష్టర్లు పెట్టుకుని వార్తలు, పాటలు వింటున్నారు.

"జాలరివాళ్ళూ! జాలరివాళ్ళూ! మీరు సముద్రం మీదికి వెళ్ళి చేపలు ఎందుకు పట్టుకు రావేదూ? మీరు చేపలు తేని కారణంగా ఒక పెద్ద కంపెనీ సమ్మెలోకి దిగింది!" అన్నారు మంత్రిగారు.

"నాలుగు రోజులక్రితం నుండి రోజూ తుఫానొస్తుందని రేడియోలో సెప్తున్నారు నువ్వినకోలేదేటి? సైగా మాం సముద్రకమీదికి ఎందుకెల్లలేదని అడుగుతున్నావా! తుఫాను రాలేదు, వల్లకాడూ లేదు! ఈ నాలుగు రోజులు మా నోటికాడ కూడడిపోనాది" అన్నాడొక ముసలాడు.

మంత్రిగారికి అసలు కిటుకు తెలిసిపోయింది!

ఆయన తిన్నగా రేడియో కేంద్రానికి వెళ్ళారు.

"సార్! మా కోడి గుడ్డు పెట్టిందికాని పొదగటం లేదు! మీరు సలహాలు కార్యక్రమంలో చెప్పినట్టు కూడా ప్రయత్నాలుచేసేం అయినా! పొదగలేదు! మీ కేంద్రానికి పంపితే పొదిగించి పంపగలరా?. అని ఎవరో సోమలింగపాలెం శ్రోత వ్రాసిన ఉత్తరానికి సమాధానం కోసం అందరూ కూర్చొని ఆలోచన సాగిస్తున్నారు.

కొందరు కోడిగుడ్డు పొదిగించి పంపటానికి ఏదైనా "జివో వుందేమోనని వెదుకుతున్నారు.

మంత్రిగార్ని చూడగానే అందరూ లేచారు!

పనసకాయ దొరికినపుడే తద్దినం పెట్టాలన్న సంగతి వారికి అనుభవ పూర్వకంగా బాగా అర్థమయింది!

"సార్, కార్మికులు-సమ్మెలు అనే విషయంపై మీతో ఇంటర్వ్యూ చేద్దామనుకుంటున్నాం" అన్నారు వాళ్ళు.

"ఇంటర్వ్యూ సంగతి తరువాత చూద్దాం అవతల కొంప మునిగింది అంటూ కొంత సేపు నిట్టూర్చి "రేడియో వాళ్ళూ! రేడియోవాళ్ళూ! తుఫానొస్తుందని నాలుగు రోజులుగా తప్పు ఎనవున్సు ఎందుకు చేస్తున్నారు?" అన్నారు.

"అవునుసార్! మేం చెప్పిన మాట నిజమే! తుఫాను రాని మాటా నిజమే కాని అందులో మా తప్పేమి లేదు! అది వాతావరణ సంస్థ వారిచ్చి భోగట్టా! మేం ఏమీ చేయలేము' అన్నారు ఏక కంఠంతో దీనంగా ఆ "మూడ్" చెదిరిపోతుందేమోనని ఒక రేడియో నాటిక రిహార్సల్ ప్రారంభించేరు వెంటనే!

మంత్రిగారు తిన్నగా వాతావరణ సంస్థ ఆఫీసుకి వెళ్ళేరు.

"సంస్థవారూ! సంస్థవారూ! మీరు తుఫానొస్తుందని తప్పు భోగట్టా రేడియోవారికి ఎందుకిస్తున్నారు? మీ వలన పెద్ద కంపెనీ సమ్మెలోకి దిగింది!" అన్నారు.

"ఏం చెయ్యం సార్! "రాడార్' లో ఒక "ఎలిమెంటు" పాడయింది. అది తప్పుగా "సిగ్నల్" ఇస్తోంది. ఆ "ఎలిమెంటు" మార్చ

డానికి ప్రయత్నిస్తున్నాం. అంతవరకూ తుఫాన్ వస్తూనే వుంటుంది. మేం మాత్రం ఏం చేయగలం?" అన్నారు.

ఆ "ఎలిమెంటు" మీకు ఎవరు సప్లయి చేశారు?" అన్నారు మంత్రిగారు.

"బాబూ ఇనుస్ట్రిమెంటు కంపెనీ అని ఈ ఊర్లోనే వుంది" అన్నారు వాళ్ళు.

మంత్రిగారి సమస్య విడిపోయింది! ఆయన హుటాహుటిని కంపెనీకి వచ్చారు. "మీరు ఎలిమెంటు సరిగ్గా చేయకపోవటంవలన ఈ అనర్ధమంతా వచ్చింది" అంటూ కథ అంతా వివరించేరు.

చటోపాధ్యాయకు ఇందులో న్యాయం కనిపించింది. మరునాడే కార్మికులు సమ్మె విరమించి పనుల్లో చేరిపోయారు. జాగ్రత్తగా పనిచేసి దేశసౌభాగ్యానికి తోడ్పడతామని హామీలు ఇచ్చేరు.

మంత్రిగారు మరో సమ్మె సంగతి తేల్చడానికి విమానంఎక్కారు.

(13–1–78) ఆంధ్రపత్రిక)